క్లుప్తంగా

బాల్య వివాహాలు అరికడదాం



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న జీసీడీఓ సునీత

గూడూరు: బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బాలిక శిశు అభివృద్ధి జిల్లా అధికారి సునీత అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల తల్లితండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు బాగా చదివించాలన్నారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే పుట్టబోయే బిడ్డలకు కూడా ప్రమాదమన్నారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను విద్యావసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. సమావేశంలో ఎస్‌ఓ ప్రిన్సిపాల్ యశోద పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి

గూడూరు: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మాధవీత ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. వ్యవసాయ పనులు పూర్తికావడంతో ఉపాధి పనులు గుర్తించి నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు.సమావేశంలో ఏపీఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించండి

సి.బెళగల్: ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ బ్రహ్మానందరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఉపాధిహామి పనుల కల్పన పురోగతిపై చర్చించారు. గ్రామాల్లో గుర్తించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. అలాగే ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పూర్తి చేయాలి



గుండ్రేవుల సమీపంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పంటల నమోదు పూర్తి చేయాలని ఏఓ మల్లేష్‌కుమార్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు.బుధవారం ఆయన మండల పరిధిలోని గుండ్రేవుల,ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల పరిధిలోని పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల ఆర్బీకేలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీలో సాగైన పంటను వీలైనంత త్వరగా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీఈఓ వెంకటేష్, వ్యవసాయ సిబ్బంది సోమేశ్వరి,షరీఫ్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించండి



ఎంపీపీ ఉసేన్‌బీతో మాట్లాతున్న హౌసింగ్ ఈఈ మాధవరావు

పాణ్యం: ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని హౌసింగ్ ఈఈ మాధవరావు మండల అధికారులను కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. తక్షణమే ప్రారంభించేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. పొదుపు సంఘాల నుంచి ఇళ్ల ప్రారంభించేందుకు రూ.40 వేల రుణం ఇస్తున్నామనే విషయాన్ని తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏఈ నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం

కోడుమూరు: సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాటాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జీపీ వీరన్న సూచించారు. సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సీపీఎంమండల కార్యాలయం ఆవరణలో కార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరగనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేసేందుకు కార్మికులంతా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గఫూర్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

నగరం 'సేఫ్'

- సత్ఫలితాలిస్తున్న సేఫ్ సిటీ కార్యక్రమం
- కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు అనూహ్య స్పందన
- రెండు వారాల వ్యవధిలో 53 కాలనీల నుంచి ఫిర్యాదు
- ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా కాలనీల్లో పెరిగిన పోలీసు గస్తీ



కర్నూలు: కర్నూలు నగరాన్ని సేఫ్ సిటీగా మార్చేందుకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డిసెంబర్ 31వ తేదీన ప్రత్యేకంగా 22 వాహనాలను ఎస్పీ సమకూర్చారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు గస్తీని ముమ్మరం చేశారు. కర్నూలు పట్టణ ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉన్నా, కాలనీలు, వీధులు తదితర ప్రాంతాలు పోలీస్ పెట్రోలింగ్ చేయాలని కోరినట్లయితే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్ http:// kurnoolpolice. in/ safecity లింక్‌ను క్లిక్ చేసి పేరు, మొబైల్ నెంబర్, సమస్య, ఏ ఏరియాలో పెట్రోలింగ్ (గస్తీ) కావాలి, ఏ పోలీస్ స్టేషన్ పరిధి, ఏ సమయంలో పోలీస్ పెట్రోలింగ్ కావాలి అనే విషయాలను నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే ఆయా ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేస్తున్నారు. ఈ లింక్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రెండు వారాల్లో సుమారు 53 కాలనీల నుంచి ప్రజలు స్పందించి లింక్‌లో వివరాలను నమోదు చేసి గస్తీని పెంచాలని కోరారు.



సేఫ్ సిటీ కోసం ఏర్పాటు చేసిన గస్తీ వాహనాలు, సిబ్బంది(ఫైల్)

పోలీసు నిఘా పెరిగింది



కర్నూలు సి.క్యాంప్ సర్కిల్, మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ప్రభుత్వ క్వార్టర్స్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో అల్లరి మూకలు బహిరంగంగా మద్యం సేవిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారు. పోలీస్ వెబ్‌సైట్‌లో గస్తీ పెంచమని రిక్వెస్ట్ పెట్టడంతో పోలీసులు స్పందించి మందుబాబులను కట్టడి చేశారు. –వి.మహేష్, సి.క్యాంప్

రిక్వెస్ట్‌కు పోలీసులు స్పందించారు



వెంకటరమణ కాలనీ ఏరియాలో అల్లరిమూకల వల్ల రాత్రి మహిళలు బయటకు రావడానికి ఇబ్బంది పడేవారు. పోలీస్ వెబ్‌సైట్‌లో గస్తీ రిక్వెస్ట్ పెట్టడంతో పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించారు. ప్రతిరోజు కూడా గస్తీ ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య లేకుండా చూడాలి. – శైలజ, వెంకటరమణ కాలనీ

డ్రంకెన్ డ్రైవ్‌ను కట్టడి చేశారు



కర్నూలు పాతబస్తీ ఉస్మానియా కాలేజీ రోడ్డు లో డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌లో రిక్వెస్ట్ పెట్టాను. సమస్యకు స్పందించి పోలీసులు రాత్రి గస్తీ ఏర్పాటు చేసి పరిష్కరించినందుకు కృతజ్ఞతలు. –మాలిక్ ఖాన్, ఉస్మానియా కాలేజ్ రోడ్

అల్లరిమూకల ఆగడాలకు కళ్లెం



కర్నూలు సేఫ్ సిటీ లక్ష్యంగా ఏర్పాటు చేసిన కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు చేసిన ఫిర్యాదుకు పోలీసులు స్పందించి అల్లరి మూకల ఆగడాలకు కళ్లెం వేశారు. విజయనగరం కాలనీ గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో రాత్రి పూట దొంగతనాలు, చిన్నచిన్న అల్లర్లు జరిగేవి. పోలీస్ వెబ్‌సైట్‌కు రాత్రి గస్తీ పెంచాలని రిక్వెస్ట్ పెంచడం వల్ల ఇప్పుడు ఆ ప్రాంతంలో అల్లరి మూకల సంచారం తగ్గింది. –ఈశ్వర్, విజయనగర్ కాలనీ

పగటి పూట గస్తీ పెంచాలి



కర్నూలు శివారులోని మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ దగ్గర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీస్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయగా గస్తీ పోలీసులు స్పందించి రాత్రివేళల్లో సమ్మర్ స్టోరేజ్ దగ్గర గస్తీ ముమ్మరం చేశారు. అయితే పోలీసులు పగటి పూట కూడా ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలను అరికట్టాలి. –శైలజ, మునగాలపాడు

సమస్య పరిష్కరించారు



కర్నూలు నగరం ఎన్ ఆర్ పేటలో కొంత మంది యువకులు రాత్రివేళల్లో గుంపులుగా చేరి అల్లరి చేస్తూ ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడేవారు. పెద్ద పెద్ద శబ్దాలతో కాలనీ ప్రజలను ఇబ్బంది పెట్టేవారు. సేఫ్ సిటీ లక్ష్యంగా ఏర్పాటు చేసిన పోలీస్ వెబ్‌సైట్‌లో రాత్రి గస్తీ కోసం రిక్వెస్ట్ పెట్టగా పోలీసులు స్పందించి పరిష్కరించారు. –ప్రదీప్‌కుమార్, ఎన్ఆర్ పేట

మేలు రకం విత్తనంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న నోడల్ అధికారి రామకృష్ణారావు

ఓర్వకల్లు: మేలు రకం విత్తనాలు వేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన రైతు పుల్లయ్య సాగుచేసిన జొన్న పొలంలో క్షేత్రస్థాయి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జే 2667 చిరు సంచి రకం విత్తనం పంట కాలం 120 రోజులని, రబీలో వర్షాధారం కింద సాగుకు అనుకూలమని చెప్పారు. జొన్న, మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను నోడల్ అధికారి డాక్టర్ రామకృష్ణారావు వివరించారు. నూతన విత్తన రకం జొన్న పంటను ప్రతిఒక్క రైతు సాగుచేసుకుని లాభాలు పొందాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ప్రసాద్‌బాబు సూచించారు. ఎన్‌జే 2667 రకం జొన్న విత్తనం ఎకరాకు 20–25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీపీడీ శ్రీలత చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు అయోష పర్వీన్, డాక్టర్ అరుణ్‌కుమార్, ఏఓ సుధాకర్, ఏఈఓలు మధు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



మహిళల సమస్యలు వింటున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని రాధానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వృద్ధులను, మహిళలను, పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, మల్లెల పుల్లారెడ్డి, ఓబులేషు రెడ్డి, నాగిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- మేయర్ బీవై రామయ్య

కల్లూరు: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం మేయర్ క్యాంపు కార్యాలయంలో 19వ వార్డు అభివృద్ధిపై సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ పాలన ప్రజలందరికీ చేరువ కావాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత సచివాలయ ఉద్యోగులదేనన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, శివరాం, జిలాన్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రామయ్య

'ఉపాధి'కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

- మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఓర్వకల్లు: ఉపాధి పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్కెట్ యార్డు చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి గ్రామంలో లేబర్ బడ్జెట్ లక్ష్యానికి తగ్గట్టుగా కూలీల సంఖ్యను పెంచాలన్నారు. వేసవిలో ఎండలను దృష్టిలో పెట్టుకుని కూలీలకు కల్పించాల్సిన సవతులను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కూలీల సౌలభ్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన టార్పాలిన్లను ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఏపీఓ కుమార్‌సాయినాథ్ పాల్గొన్నారు.



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి

ఓర్వకల్లు: పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి లభిస్తుందని ఎంపీపీ తిప్పన్న అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు, ఉయ్యాలవాడ, హుసేనాపురం గ్రామాల్లో పొదుపు గ్రూపు సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఏపీఎం వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిప్పన్న మాట్లాడుతూ దుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఒక్కో యూనిట్ ధర రూ.3వ016ల చొప్పున మొత్తం 75 యూనిట్లకు రూ.2,26,200 ఖర్చు పెట్టి డీఆర్‌డీఏ అధికారులు కోళ్లను సరఫరా చేయడం సంతోషకరమన్నారు. ఒక్కో సంఘానికి 3 పుంజులు, 8 పెట్టలు పంపిణీ చేశారు. ఆసక్తి గల సభ్యురాళ్లు నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించి కోళ్లను తీసుకోవాలని ఏపీఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు ఫాతిమాబీ, కుసుమలత, సర్పంచులు చంద్ర గోవర్ధనమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.



హుసేనాపురంలో కోళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిహారం అందజేత

కోడుమూరు: లద్దగిరి గ్రామానికి చెందిన తోట్ల రాందాసు ఈ నెల 9న గుండెనొప్పితో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద ఆ కుటుంబానికి రూ.లక్ష మంజూరైంది. మట్టి ఖర్చుల కోసం బుధవారం బాధిత కుటుంబసభ్యులు తోట్ల సరస్వతికి పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ జీఎం రామచంద్రుడు, వలంటరీ స్వాములు రూ.పదివేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు బాధిత కుటుంబానికి చెందిన బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు.

బహుమతుల పంపిణీ

గూడూరు: క్రిస్మస్ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ బహుమతులు అందించారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.40,016, రూ.25,016, రూ.15,016 నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జే.ఆబేలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

గడివేముల: క్రీడలతో స్నేహభావం అలవడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ హరినాథ్, ఉప సర్పంచ్ బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

సి.బెళగల్: అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు గురువారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, పద్మావతి కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటల్లోగా అభ్యర్థులు అక్కడికి చేరుకోవాలన్నారు.

నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలి

సి.బెళగల్: భవన నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని సింగల్‌విండో చైర్మన్ గోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన సింగల్‌విండో కార్యాలయ ఆవరణంలో చేపట్టిన భవన నిర్మాణాలను పరిశీలించారు. రూ.44 లక్షలతో నిర్మితమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనుల నాణ్యతలో రాజీపడొద్దని సీఈఓ రవికుమార్‌రెడ్డిని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు: సివిల్ సప్లయి కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ కోడుమూరు డివిజన్ కార్యదర్శి జే.మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో సివిల్ సప్లయి కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ 2022 జనవరి 1 నుంచి పెంచిన కూలి రేట్లను అమలు చేయాలన్నారు. అదనపు గోదాములు నిర్మించి వే బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ ఎస్ విజయలక్ష్మమ్మ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు.

బండి..జగమొండి



తోస్తున్న ప్రయాణికులు

గడివేముల:నంద్యాల నుంచి నందికొట్కూరుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు బుధవారం గడివేములలో మొ రాయించింది. ఎంతకూ స్టార్ట్ అవకపోవడంతో ప్రయాణికులు కిందకు దిగి తోయాల్సి వచ్చింది. కండీషన్‌లో లేని ఇలాంటి బస్సులను మార్చాలని ప్రయాణికులు కోరారు.

సంక్రాంతి సంబరం



కోడుమూరులో బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ అనంతయ్య, కెనరా బ్యాంకు మేనేజర్ మహబూబ్ బాషా

పాణ్యం/గడివేముల/కోడుమూరు: ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పాణ్యంలోని లిటిల్ జ్వాలా పాఠశాల, గడివేములలోని రాజరాజేశ్వరీ పాఠశాల, కోడుమూరులోని నాగార్జున విద్యాలయంలోనూ యాజమాన్యాలు, విద్యార్థులు వేడుకలను నిర్వహించుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కరస్పాండెట్లు లక్ష్మీనారాయణ, రామేశ్వరరావు, నాగార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

గడివేముల: పంటల్లో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో సాగు చేస్తున్న శనగ పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సాగు చేసిన ప్రతి పంట వివరాలను వ్యవసాయ సిబ్బందికి అందజేసి నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఓ హేమసుందర్‌రెడ్డి ఉన్నారు.



చిందుకూరు సమీపంలో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్

మైనింగ్ లీజును రద్దు చేయాలి

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం పరిసర ప్రాంతంలో టీడీపీ నేతకు చెందిన కుటుంబ సభ్యులు కేఈ రుద్రపని, అతని సన్నిహితుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సిలికా క్వార్ట్జైట్ గని పరిశ్రమ లీజు అగ్రిమెంట్లను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకులు రామకృష్ణ, నాగన్న తహసీల్దార్ శివ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బుధవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని 288/పిలో ఉన్న 105 ఎకరాలను లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. కేతవరం పొలిమేరలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మైనింగ్ తవ్వకాలతో చిన్న, సన్న కారు రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, రంగస్వామి, గఫార్‌మియా, వెంకటస్వామి, రాఘవేంద్ర, శేషాద్రి, మధుసూదన్, చంద్రబాబు, చాంద్‌బాషా, కన్నమడకల, కలమందలపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

కర్నూలు (న్యూటౌన్): విధుల్లో నిర్లక్ష్యం వద్దని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ సుధాకర్, పీఓఎల్ఆర్ డీటీ శారద, వీఆర్ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. ఆయా సర్వే నంబర్లలో రీ సర్వే చేస్తున్నప్పుడు సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఈ నెల 28లోపు పక్కాగా సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తామన్నారు. స్పందన వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

పౌష్టికాహారం తీసుకోవాలి

సి.బెళగల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న సూచించారు. బుధవారం ఆయన అంగన్‌వాడీ కేంద్రం–4లో వర్కర్ మహేశ్వరమ్మ గర్భిణులకు సీమంతం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు. కార్యక్రమంలో కొటారుమిట్ట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణికి సీమంతం చేస్తున్న దృశ్యం